సాక్షి నంద్యాల

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో శనగల బసవన్నకు, శ్రీశైలక్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



రూ. లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కృష్ణా జిల్లా తాడిగడపకు చెందిన అహల్యారాణి రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,616.44
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:52.917
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,463

న్యూస్‌రీల్

ఏపీలో వైద్యసేవలు భేష్



ఆసుపత్రిలో పర్యటిస్తున్న డాక్టర్ అనురాధ

బొమ్మలసత్రం: ఏపీ ప్రభుత్వాసుపత్రిల్లో పేదలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందుతున్నాయని నేషనల్ హెల్త్ ప్రోగ్రాం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ అన్నారు. మంగళవారం నంద్యాల సర్వజన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో రోగులకు కావాల్సిన అన్ని అధునాతన పరికరాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం, ఆపరేషన్ థియేటర్, మెడికల్ వార్డులు ఎంతో పరిశుభ్రంగా ఉంచారని పేర్కొన్నారు. రోగులకు కావాల్సిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వైద్యులు అందిస్తున్న చికిత్స విధానంపై తానే స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నామన్నారు. ఆమె వెంట ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ లలిత, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

స్వామి రాకతో పండుగ



అహోబిలేశుడిని దర్శించుకుంటున్న భక్తులు

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ మంగళవారం నాగిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. పల్లకీలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులు శ్రీ జ్వాలా నరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాదవరదస్వాములను గ్రామస్తులు దర్శించుకున్నారు.

11న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): ఫిబ్రవరి 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు సూచించారు. మంగళవారం న్యాయ సేవా సదన్‌లో ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీ పడే అవకాశం ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారం గురించి చర్చించారు. అనంతరం పోలీసు అధికారులతో ఆయన మాట్లాడుతూ రానున్న జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించి కక్షిదారులకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు టి.జ్యోత్స్న దేవి, కె.భార్గవి, జి.వందనకుమారి, ఎం.కళ్యాణి, కర్నూలు టౌన్ డీఎస్పీ మహేష్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఈ-శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ఈ-శ్రామ్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ-శ్రామ్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

- ఉమ్మడి జిల్లాలో

రూ.126.66 కోట్ల పంపిణీకి ఏర్పాట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఫిబ్రవరి మాసానికి సంబంధించి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న 4,57, 462 మంది పెన్షనర్లకు రూ.126.66 కోట్లు విడుదలయ్యాయి. పెన్షన్ కానుక నిధులను సంబంధిత బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇప్పటికే డ్రా చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. కొత్త పింఛన్లు, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు బదిలీ అయిన పింఛన్లను వలంటరీలతో మ్యాపింగ్ చేయడానికి ప్రభుత్వం లాగిన్ కూడా ఇచ్చింది. బుధవారం ఉదయం 5 గంటల నుంచే వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయనున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ ఏర్పాట్లు చేసింది.

సరికొత్త హంగులు కార్పొరేట్ సొబగులు

గతంలో సమస్యలకు నిలయాలుగా ఉన్న ప్రభుత్వ విద్యాలయాలు నేడు సరికొత్త రూపుదాల్చుతున్నాయి. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి చదువులు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు విద్యా ప్రమాణాలను మెరుగు పరుచుతూ మరో వైపు మౌలిక వసతులను మరింత సమకూర్చుతోంది. జిల్లాలో అంగన్ వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో చేపట్టిన మన బడి నాడు -నేడు రెండో విడత పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చురుగ్గా జరుగుతున్న అదనపు గదుల నిర్మాణం

- ముమ్మరంగా రెండవ విడత నాడు -నేడు పనులు
- కార్పొరేట్‌కు దీటుగా మారుతున్న విద్యాలయాలు
- రూ. 366 కోట్లతో పాఠశాలలకు కొత్త హంగులు
- మే నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఆదేశాలు

కోవెలకుంట్ల: సర్కారు బడుల్లో సౌకర్యాలు ఉండవని.. చదువులు అంతంతమాత్రమని.. అధికారుల పర్యవేక్షణ లేదని.. విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొన్న భావనను చెరిపేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. మన బడి నాడు - నేడు కార్యక్రమంతో మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి నోచుకుంటున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో చేపట్టిన మొదటి విడతలో రూ. 325 కోట్లతో 1,080 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను తీర్చిదిద్దారు. రెండవ విడతలో జిల్లాలో 979 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అదనపు గదులు, మరమ్మతులు, మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 366.76 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అలాగే జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నాడు- నేడు పథకం కింద ఎంపిక చేసి రూ. 12.88 కోట్లు కేటాయించారు. వీటిల్లో సైతం పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ ఏడాది మే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసేలా పనులు వేగవంతమయ్యాయి. జిల్లాలోని 870 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆయా మండలాల పరిధిలో 222 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 127.89 కోట్లు, 872 పాఠశాలల్లో మరమ్మతు పనులు, మౌలిక వసతులకు రూ. 168.81 కోట్లు, 416 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణానికి రూ. 56.72 కోట్లు కేటాయించారు. ఆయా పాఠశాలల విద్యాకమిటీలు, హెచ్‌ఎం ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి.

చక చకా పది రకాల అభివృద్ధి పనులు

జిల్లాలో రెండో విడత నాడు- నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో పది రకాల పనులు జరుగుతున్నాయి. మినరల్‌వాటర్ ప్లాంట్లు, మరుగుదొడ్లు, ప్రహరీలు, కిచెన్‌షెడ్ల నిర్మాణం, గోడలకు రంగులు, లైట్లు, ఫ్యాన్లు, కుర్చీలు, బెంచీలు, ఇంగ్లిష్ ల్యాబ్, గ్రీన్ చాక్‌బోర్డు, తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు మేజర్, మైనర్ మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ పనులన్నింటిని అత్యంత నాణ్యతగా, వేగంగా చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సర్కారు బడులు కార్పొరేట్ స్థాయిలో రూపుదాల్చి విద్యార్థులకు స్వాగతం పలికేలా సిద్ధం చేస్తున్నారు.

సరికొత్తగా అంగన్‌వాడీలు

జిల్లాలోని ఆయా మండలాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చిన్నారులకు విద్య బోధించేందుకు సువిశాలమైన హాల్, కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం నిల్వ చేసేందుకు న్యూట్రిషియన్ గది, మధ్యాహ్న భోజన పథక నిర్వహణకు వంటగది ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మౌలిక వసతులు కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో బాత్‌రూం, మరుగుదొడ్డి, తదితర వసతి కల్పించేలా పనులు జరుగుతున్నాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 13.64 లక్షల నిధులు కేటాయించారు. మూడు నెలల్లో భవన నిర్మాణాలను పూర్తి చేసి స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించేలా పనులు వేగవంతయయ్యాయి. కొత్త భవనాలతోపాటు ఆయా మండలాల పరిధిలోని 99 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ. 2.44 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఆయా కేంద్రాల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి.



గోస్పాడులో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కళాశాలల్లో అభివృద్ధి పరుగులు

జిల్లాలోని 20 జూనియర్ కళాశాలలను రెండవ విడత నాడు- నేడు కార్యక్రమానికి ఎంపిక చేశారు. కోవెలకుంట్ల, బండిఆత్మకూరు, సంజామల, ఆళ్లగడ్డ, డోన్, పాములపాడు, కొలిమిగుండ్ల, గోస్పాడు, మిడుతూరు, నందికొట్కూరు, అవుకు, ఆత్మకూరు, నంద్యాల, ప్యాపిలి, బనగానపల్లె, శ్రీశైలం, శిరివెళ్ల, పాణ్యం మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల మరమ్మతులు, అదనపు గదులు, తదితర పనులకు రూ. 12.88 కోట్లు మంజూరయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని కళాశాలల్లో పలు రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థా కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులతో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి రోజు తమ పరిధిలోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.



కొలిమిగుండ్ల జూనియర్ కళాశాలలో ప్రహరీ నిర్మాణం చేపట్టిన దృశ్యం



నంద్యాలలో నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న పర్యవేక్షణ అధికారులు

జిల్లాలో రెండవ విడత నాడు -నేడుకు ఎంపికైనవి	
ప్రాథమిక పాఠశాలలు	590
ప్రాథమికోన్నత పాఠశాలలు	80
ఉన్నత పాఠశాలలు	190
అంగన్‌వాడీ కేంద్రాలు	99
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	20

సర్కారు బడులకు మంచి రోజులు



రాష్ట్ర ప్రభుత్వం నాడు- నేడు పథకం ద్వారా సర్కారు బడులకు మహర్దశ పట్టుకుంది. నాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం కాగా ముగ్గురిని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. రెండవ విడతలో పాఠశాలను ఎంపిక చేసి తరగతి గదులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు మరుగుదొడ్లు, వంటగది, తదితర అన్ని వసతులు కల్పిస్తున్నారు.
– లింగమయ్య, కోవెలకుంట్ల

కళాశాలకు కొత్త హంగులు



కళాశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం నాడు- నేడు పథకం ద్వారా రూ. 30.98 లక్షలు నిధులు మంజూరు చేసింది. దీంతో కళాశాలకు అన్ని హంగులతో వసతులు కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలను తలపిస్తున్నాయి.
–హేమలత, ఇంటర్ విద్యార్థిని, సంజామల

సకాలంలో పూర్తి చేస్తాం



కోవెలకుంట్ల మండలంలో రెండవ విడతకు 26 పాఠశాలలు ఎంపికయ్యా యి. ఏడు పాఠశాలల్లో అదనపు గదులు, మిగిలిన పాఠశాలల్లో మరమ్మతులు, ప్రహరీ, తదితర వసతుల కల్పనకు రూ. 9.56 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఫస్ట్‌ఫేజ్ లో రూ. 1.60 కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదల కాగా పనులన్నీ పూర్తి చేశాం. సెకండ్‌ఫేజ్ రివాల్వింగ్ ఫండ్ అందిన వెంటనే మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేస్తాం.
– మధుబాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్, కోవెలకుంట్ల

సమన్వయంతో పనిచేద్దాం

11 నుంచి శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- మూడు జిల్లాల అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష
- కాలినడక భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు
- బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు



బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. ఈ నెల 11నుంచి 21వ తేదీ వరకు శ్రీశైలంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్నతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం దేవస్థాన సీసీ కంట్రోల్ రూంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో నంద్యాల, ప్రకాశం, తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూలు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా శ్రీశైల దేవస్థాన ఈఓ ఎస్.లవన్న గత సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో చేపట్టిన ఏర్పాట్లను, సౌకర్యాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం విభాగాల వారీగా చర్చించారు. 11 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో అన్ని శాఖల అధికారులు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో డీఆర్వోపుల్లయ్య, ఆత్మకూరు ఆర్డీఓ దాస్, డీఎస్పీ శృతి, తహసీల్దార్ రాజేంద్రసింగ్, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవ క్రతువు

బ్రహ్మోత్సవాలను ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తాం. భక్తులకు సులభంగా స్వామివారి దర్శనం అయ్యేలా నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేశాం. 13వ తేదీన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, 14న కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం, తిరుమల తిరుపతి దేవస్థానం.. 15న రాష్ట్రప్రభుత్వం తరపున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మూడు లక్షలకు పైగా లడ్డూప్రసాదాలు తయారు చేస్తున్నాం. 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభోత్సవం, పాగాలంకరణ, లింగోద్భవ కాల మహాన్యాసరుద్రాభిషేకం, కల్యాణోత్సవం, శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం. 19న రథోత్సవం, తెప్పోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. కాలినడక భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం. – ఈఓ ఎస్.లవన్న

పటిష్ట పోలీస్ బందోబస్తు

బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో సుమారు 3వేలకు పైగా వాహనాల పార్కింగ్‌కు అవకాశం ఉంటుంది. కమాండ్ కంట్రోల్ రూం నుంచి 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. పాగాలంకరణ ముగిసిన వెంటనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యం కల్పిస్తాం. –జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

అధికారులకు ఆదేశాలు ఇలా..

- రద్దీ ప్రదేశాలలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు, వైద్య నిపుణులు, మందులను సిద్ధంగా ఉంచాలి.
- పాతాళగంగ, లింగాలగట్టు ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని, ఆయా ప్రాంతాల్లో 200 మంది గజ ఈతగాళ్లు.. లైఫ్‌జాకెట్లు, పుట్టీలు సిద్ధం చేయాలి.
- పాతాళగంగ ఘాట్ల వద్ద తాత్కాలిక టాయ్‌లెట్స్, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు నిర్మించాలి.
- రవాణా సౌకర్యార్థం ఆంధ్ర నుంచి 600 బస్సులు, తెలంగాణ నుంచి 180 బస్సులను నడపాలి.
- వసతి సౌకర్యాల్లో ఇబ్బందులు తలెత్తరాదు.
- పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా అవసరమైన సిబ్బంది నియామకం.
- ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు రోడ్డు మరమ్మతులు
- ఎంపిక చేసిన ప్రాంతాల్లో ట్యాంకర్లు, నీటి కుళాయిల ఏర్పాటు.
- భారీ వాహనాలు గిద్దలూరు మీదుగా నంద్యాల, కర్నూలు చేరుకునేలా మళ్లింపు
- అదనంగా 50 సీసీ కెమెరాలు, డ్రోన్లతో ఉత్సవాల పర్యవేక్షణ
- 8 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా చర్యలు
- ఆహార కల్తీ లేకుండా తనిఖీలు. అంతరాయం లేని విద్యుత్ సరఫరా.
- తాత్కాలికంగా 30 పడకల ఆసుపత్రి. అందుబాటులో 24 గంటలు వైద్య సేవలు
- ఏడు 108 వాహనాలు, పాదయాత్రలో ఒక అంబులెన్స్, బ్రాహ్మణకొట్కూరు నుంచి శ్రీశైలం వరకు 24 ప్రదేశాల్లో వైద్య శిబిరాలు.

కబడ్డీ క్రీడాకారుడికి శాప్ చైర్మన్ ఆర్థిక సాయం



కబడ్డీ క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు తదితరులు

పగిడ్యాల: ప్రమాదవశాత్తూ కాలు విరిగి మంచానికి పరిమితమైన కబడ్డీ క్రీడాకారుడికి వైద్య ఖర్చుల నిమిత్తం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటారు. మండలంలోని ప్రాతకోట గ్రామానికి చెందిన సి. పవన్‌కుమార్ నంద్యాల ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇరవై రోజుల క్రితం నందికొట్కూరు పట్టణంలో నిర్వహించిన జగనన్న క్రీడా సంబరాలలో కబడ్డీ ఆడుతుండగా ప్రమాదవశాత్తూ కాలు విరిగింది. శస్త్ర చికిత్స చేయించాలని వైద్యులు సూచించడంతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి స్పందించి రూ. 1లక్ష ఆర్థిక సాయం చేశారు. మంగళవారం నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, జిల్లా శాప్ కో ఆర్డినేటర్ పెరుమాళ్ల శ్రీధర్‌లు ప్రాతకోట గ్రామానికి చేరుకుని క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందించడంతో కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట మండల వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిలార్‌సాహెబ్, కొత్తపల్లి మండల వైస్ ఎంపీపీ సింగారం రంగా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీరవోలు వెంకటేశ్వర్లు, పుట్టా వెంకటరమణ, మిద్దె మోక్షం, రమణప్రసాద్, కురువ మల్లయ్య, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

సిద్ధేశ్వరా.. పాహిమాం..!

హొళగుంద: మండల కేంద్రంలోని సిద్ధేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం రాత్రి కడు రమణీయంగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజల భారీగా తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించి తన్మయత్వం పొందారు. ముందుగా స్వామివారి ఆలయంలో మూల విరాట్‌కు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాభిషేకాలు, ఆకుపూజ, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఎదురు బసవన్నగుడి చుట్టూ లాగారు. అనంతరం విగ్రహాలను(సిద్ధప్ప, సిద్ధమ్మ వార్లు) రథంలో ఉంచి అశేష భక్త జనుల మధ్య అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులు కుంభాలు, భారీ గజమాలలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భాగంగా బుధవారం లంకాదహనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్ తెలిపారు.

11న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహార్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని విద్యాలయ ప్రిన్సిపాల్ కె.సాగరిక తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2023-2024 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షకు హాజరయ్యేవారు హాల్‌టికెట్లను https://navodaya.gov.in/www.nvsadmissionclassnine.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాన్నారు.

క్లుప్తంగా

డైరీ విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం -2023 డైరీని మంగళవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పథకాలను రైతులకు చేరవేయాలని ఏఈఓలకు సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈఓల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు మణిమోహన్‌రెడ్డి, కోశాధికారి బి.నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌వీ మోహన్‌రెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ పథకాల అమలుకు కృషి

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ-వైకేపీ, మెప్మా ద్వారా మత్స్యశాఖ పథకాల అమలుకు కృషి చేస్తున్నామని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఫిష్ ఆంధ్ర కింద 52 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యశాఖ పథకాల ద్వారా సంఘాలు కూడా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ, మెప్మా ద్వారా 126 యూనిట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక సంఘాల నుంచి 72, అర్బన్ ప్రాంతాలకు ఫిష్ కియోస్క్‌లు ఏర్పాటు చేసేందుకు 7 దరఖాస్తులు అందాయన్నారు. మినీ ఫిష్ వెండింగ్ యూనిట్ల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్ కాస్ట్ రూ.లక్ష, అర్బన్ ప్రాంతాల్లో రూ.3.25 లక్షల వరకు ఉంటుందని, ఫిష్ కియోస్క్‌ల యూనిట్ కాస్ట్ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లలో రొయ్యలు, పీతలు, అన్ని రకాల చేపలు, సముద్రపు చేపలు లభిస్తాయన్నారు. కియోస్క్‌ల్లో చేపల అనుబంధ ఉత్పత్తులైన రెస్టారెంట్ తరహాలో ఫిష్ రోస్ట్, కర్రీ, ఫిష్-65 లభిస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి నేడు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(సెంట్రల్): ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లమో ఇన్ ఫార్మసీ కోర్సులో ప్రవేశాల కోసం ఫిబ్రవరి ఒకటో తేదీన స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 సీట్లు ఉన్నాయని, ఇందులో 4 సీట్లను ఈడబ్ల్యూఎస్ కోటాకు కేటాయించినట్లు చెప్పారు. ఇంటర్ ఎంపీసీ లేదా బైపీసీ పాసైన వారు అర్హులని, ఫిబ్రవరి 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు కాలేజీలో అడ్మిషన్ పొందాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ సెట్లు, పాస్ ఫొటోలు, రూ.7 వేల ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాల్సి ఉందన్నారు.

ప్లాస్టిక్ నిషేధం షురూ

- బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగంపై నిషేధం అమలు
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావమైన నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- ప్రత్యామ్నాయంగా బట్ట, పేపరు బ్యానర్లు వాడాలని సూచన
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలకు సిద్ధం



నిషేధం అమలు బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఇతర అధికారులు (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): సామాన్యుడు మొదలుకొని కోటీశ్వరుడి వరకు ఏ కార్యక్రమం చేపట్టినా ప్రచారానికి బ్యానర్లే ఉపయోగిస్తున్నారు. కాస్తా పెద్ద కార్యక్రమైతే ఫ్లెక్సీలనూ దింపేస్తున్నారు. ఫలితంగా ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగం పెరిగిపోయింది. ఇది పర్యావరణం, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా వాటిల్లుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జనవరి 26 నుంచి రాష్ట్రంలో ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగంపై నిషేధం విధించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తామని ప్రకటించింది.

పర్యావరణ హితం కోసం..

ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వినియోగం అధికమైంది. వీటిని క్షీణింపజేయడానికి వేల ఏళ్లు పడుతుంది. అంతవరకు ప్లాస్టిక్ ముక్క ఉన్న ప్రాంతంలో మొక్క కూడా మొలవదు. నదులు, సముద్రాల్లో కలిస్తే జీవరాశులకు ప్రాణహాని ఏర్పడుతుంది. ఒక వేళ వ్యర్థాలను కాల్చినా కార్బన్ మోనాక్సైడ్, ఫ్లోరోక్లోరో కార్బన్లు, నైట్రోజన్, సల్ఫర్ తదితర హానికర వాయువులు వెలువడి వాతావరణంలో కలిసిపోయి విషపూరితమవుతున్నాయి. ఈ క్రమంలో ప్లాస్టిక్ వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం ఉంది. బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగం కూడా అధికంగా ఉండడంతో వాటిపైనా నిషేధం విధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఏపీ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 65ను విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగంపై రాష్ట్రంలో గణతంత్ర దినోత్సవాల నుంచి నిషేధం అమల్లోకి వచ్చింది.

భారీ జరిమానాలు..

రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను వినియోగిస్తే చదరపు అడుగుకు రూ.100 చొప్పున జరిమానా విధిస్తారు. బ్యానర్లు, ఫ్లెక్సీలను తయారు చేసే సంస్థలకు మొదటిసారి రూ.50 వేలు, రెండో సారి రూ.లక్ష జరిమానా విధిస్తారు. మూడోసారి దొరికితే సంస్థను సీజ్ చేస్తారు. గోదాముల్లో నిల్వ చేసుకుంటే మొదటి సారి రూ.25 వేలు, రెండోసారి రూ.40 వేలు, రవాణా చేసే వాహనాలకు మొదటి సారి దొరికితే రూ.25 వేలు, రెండోసారి రూ.50 వేలు జరిమానా విధిస్తారు. ఈ జరిమానాలను కలెక్టర్‌తోపాటు కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పరిషత్, పంచాయతీ, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు, సచివాలయాలు, ఎంపీడీఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సెక్రటరీ, పర్యావరణ కార్యదర్శి, సెబ్, రవాణా, వాణిజ్య పనుల శాఖల అధికారులు విధించే అవకాశం ఉంది.

విస్తృత అవగాహన

ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగంపై నిషేధం విధించడంతో ప్రత్యామ్నాయాలపై వినియోగదారులు దృష్టిసారించాల్సి ఉంది. బట్ట, పేపరుతో తయారు చేసిన బ్యానర్లను వాడాలి. వాల్ పెయింటింగ్‌లను ఉపయోగించుకోవచ్చు. కాగా, ప్రత్యామ్నాయ బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగంపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. కళాజాతాలు, డ్రామాలు, నాటకాల ద్వారా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరిస్తుండడంతో ప్రజల్లో మార్పు వస్తోంది.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి



ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి కూడా మేము ప్లాస్టిక్ బ్యానర్లను వినియోగించడంలేదు. భావితరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇది. అందరూ పాటించాలి. – పి.కోటేశ్వరరావు, కలెక్టర్

నిబంధనలను ఉల్లంఘించొద్దు



ప్లాస్టిక్ వాడకంపై ప్రభుత్వం విధించిన నిబంధనలను ఎవరూ ఉల్లంఘించరాదు. చిన్న చిన్న కార్యక్రమాలకు సైతం ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను పెడుతున్నారు. ఇకపై ప్లాస్టిక్ బ్యానర్లను తయారు చేసినా, దాచుకున్నా, రవాణా చేసినా, వినియోగించినా చర్యలు తప్పవు. చదరపు అడుగుకు రూ.100 చొప్పున జరిమానా విధిస్తాం. – బీవై మునిప్రసాద్, పీసీబీ ప్రాంతీయాధికారి

మిషనరీల అప్‌గ్రేడ్ కోసం తక్కువ వడ్డీకే రుణాలు

ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను తయారు చేసే మిషనరీ సంస్థలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 85 వరకు ఉన్నాయి. పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్‌ను నిషేధించడంతో యజమానులు మిషనరీలను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇదే సమయంలో వినియోగదారుడిపై కూడా భారం ఎక్కువ అవుతుంది. అయినా కూడా పర్యావరణం, ప్రజారోగ్యం దృష్ట్యా ప్రత్యామ్నాయంగా బట్టతో తయారు చేసిన బ్యానర్లను వినియోగించాల్సి ఉంది. అయితే బట్టతో బ్యానర్లను తయారు చేసుకునే మిషనరీలను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి యజమానులకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంది.

హైరిస్క్ గర్భిణులను గుర్తించి చికిత్స చేయండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోగ్రామ్ అధికారులు వారికి కేటాయించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు క్రమం తప్పకుండా సందర్శించి జాతీయ కార్యక్రమాలు సమీక్షించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను విజయవంతం చేయాలన్నారు. అలాగే హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని కాన్పు తేదీకి వారం ముందే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించాలన్నారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించి రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు ఇప్పించడం, ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్‌ఎం కనీసం రోజుకు ఐదు హెల్త్ ఐడీ కార్డులు జనరేట్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయిన కేసులను ఫాలోఅప్ చేసి ఏఎన్‌ఎం యాప్‌లో సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఎన్‌సీడీ పీఓ, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి హేమలత, మలేరియా అధికారి నూకరాజు, ఎస్‌ఓ హేమసుందర్, డీపీహెచ్ఎన్‌ఓ లిడియా, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఉమాపతి



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి హెచ్చరించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు సంస్థకు ఎంతో ముఖ్యమని, మెరుగైన సేవలందించడమే ముందున్న లక్ష్యమని వెల్లడించారు. ఏ సమస్య ఎదురైనా సంబంధిత లైన్‌మెన్‌కు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. దీనిపై ఆయన స్పందించని పక్షంలో ఏఈ, ఏడీఈ, ఈఈలకు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రతి మంగళవారం తాను నిర్వహించే డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పుకోవాలని, వాటిని తానే స్వయంగా తెలుసుకొని, పరిష్కారం చూపుతానని వెల్లడించారు. లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసినా పరిష్కారం అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశెనగ	5110	8891
ఆముదం	6080	6492
ఉల్లి	407	1030
ఎండు మిర్చి	6229	28239
శనగలు	4442	4662
కందులు	2008	7159
మొక్కజొన్న	2117	2164
మినుములు	6790	6860

చికిత్స పొందుతూ కోలుకోలేక బాలిక మృతి

ఆళ్లగడ్డ: మార్కులు తక్కువగా వస్తున్నాయని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలిక కోలుకోలేక మృతిచెందింది. చాగలమర్రిలోని ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక (14) ఇటీవల సమ్మెటివ్ రాసింది. ఈ పరీక్షల్లో సహచర విద్యార్థులకంటే మార్కులు తక్కువగా రావడంతో మనస్తాపంతో ఈ నెల 28న ఇంట్లోనే క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు నంద్యాల వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నా కోలుకోలేక పోయింది. పరిస్థితి విషమించడంతో మంగళవారం హైదరాబాద్ తరలిస్తుండగా బాలిక మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమణయ్య తెలిపారు.

మెరుగైన సేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): గ్రామస్థాయిలో సామాజిక ఆరోగ్య అధికారులు(సీహెచ్‌వో) మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో సామాజిక ఆరోగ్య అధికారులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా చూడాలని, మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేంతవరకు తగిన సేవలు, చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ ఉమ, డీపీవో విజయరాజు, డాక్టర్లు పాల్గొన్నారు.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం.

షార్ట్ టెండరు నోటీస్ - రెండవ పిలుపు

ఆర్.సి.నెం.ఐ 3/189/2023 తేది: 31.01.2023

వ.సం.	పనిపేరు
1	శ్రీశైలదేవస్థానము నందు తేది : 11-02-2023 నుండి తేది : 21-02-2023 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు మరియు ఉగాది - 2023 మహోత్సవములు అత్యంత వైభవముగా నిర్వహించబడుచున్నవి. కావున దేవస్థానమునకు సంబంధించి వివిధ ప్రదేశములలో అవసరమైన వంట వారిని, వంట పాత్రలు సమకూర్చుకొని దేవస్థానము వారు తెలిపిన ప్రకారము వంట పదార్థములు తయారు చేయవలయును. ఇతర వివరములకు ఫోన్ : 8500782182, 9440688222లను సంప్రదించవలయును.ఇతర వివరముల కొరకు www.apeprocurement.gov.in నందు చూడగలరు.

శివకార్యంలో... సం/- ఎస్.లవన్న, డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి

అండర్-17 రగ్బీ విజేతలు కర్నూలు జట్లు



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో డబుల్ క్రౌన్ సాధించిన కర్నూలు బాల, బాలికల జట్లు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న 66వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాల బాలికల రగ్బీ విజేతలుగా కర్నూలు జట్లు నిలిచాయి. మంగళవారం సాయంత్రం జరిగిన బాలుర ఫైనల్ పోటీల్లో నెల్లూరు జట్టుపై 25-10 స్కోర్‌తో కర్నూలు బాలుర జట్టు విజేతగా నిలిచింది. నెల్లూరు జట్టు రన్నర్స్, ప్రకాశం జిల్లా జట్టు మూడో స్థానం, విశాఖపట్నం జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. అలాగే బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై కర్నూలు బాలికల జట్టు 5-1 స్కోర్‌తో గెలుపొందింది. నెల్లూరు జట్టు రన్నర్స్, తూర్పుగోదావరి జిల్లా జట్టు మూడో స్థానం, కృష్ణా జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య వెల్లడించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రంగా రెడ్డి విజేతలకు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యా మందిర్ కరస్పాండెంట్ తిమ్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, పీఈటీల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల సలహాదారుడు విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బాషా, వెంకటరాముడు, జయమ్మ పాల్గొన్నారు.

అండర్-14 రగ్బీ పోటీలు ప్రారంభం...

రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలకు అతిథులుగా రాష్ట్ర రగ్బీ సంఘం అధ్యక్షులు టీజీ భరత్, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. మిలిటరీ కాలనీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల పరిశీలకులు రవిప్రసాద్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సీజ్



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

డోన్ రూరల్: ట్యాక్స్ కట్టకుండా అక్రమంగా నడుపుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును మంగళవారం ఎంవీఐ క్రాంతికుమార్ సీజ్ చేశారు. స్థానిక ఆర్‌టీఓ కార్యాలయం వద్ద 44వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి కదిరివైపు వెళ్తున్న మణికంఠ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేశారు. అయితే బస్సు రిజిస్ట్రేషన్, చాయిస్ నెంబర్లు వేర్వేరుగా ఉన్నాయి. తెలంగాణ వాహనానికి ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ ఉండటంతో పాటు ట్యాక్స్ కూడా కట్టకుండా అక్రమంగా నడుపుతుండటంతో బస్సును సీజ్ చేసి, రూ.1,24,500 జరిమానా విధించారు.

నలుగురికి గాయాలు

ఆదోని రూరల్: ఆరేకల్ శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఎమ్మిగనూరు వైపు నుంచి ఆదోనికి వస్తున్న కారు కేబీఎన్ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సిమెంట్ దిమ్మెను ఢీకొంది. ప్రమాదంలో కారు డ్రైవర్ వెంకటేశ్వర్లతో పాటు అందులో ఉన్న పద్మజ, బాలాజీ, భరత్‌లకు గాయాలయ్యాయి. వారిని ఆదోని ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

- ఉరి వేసుకుని భర్త ఆత్మహత్య



మృతిచెందిన కిరణ్

ఆదోని అర్బన్: మద్యం తాగడానికి భార్య డబ్బు ఇవ్వలేదనే మనస్తాపంతో భర్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమాన్‌నగర్‌కు చెందిన కిరణ(36) కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా అతడు మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని భార్య కృష్ణవేణిని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సీతమ్మ'.. కరుణించేనా?

- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- ఇందులోనే రైల్వే బడ్జెట్‌కు కేటాయింపులు
- రూ.2వేల కోట్ల నిధులిస్తేనే పట్టాలపైకి రైల్వే పురోగతి



కర్నూలు సిటీ రైల్వే స్టేషన్

కర్నూలు (రాజ్‌విహార్): కేంద్ర బడ్జెట్‌పై రైల్వే ప్రయాణికులు కోటి ఆశలు పెట్టుకున్నారు. రైల్వే బడ్జెట్‌ను ఎత్తేసిన ఎన్‌డీఏ సర్కారు సాధారణ బడ్జెట్‌లోనే రైల్వేకు కేటాయింపులు చేస్తోంది. 2023-24 వార్షిక బడ్జెట్‌ను బుధవారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. దీంతో 'సీతమ్మ' తమ మొర ఆలకిస్తారా అని జిల్లా ప్రజలు ఎదురు చేస్తున్నారు. మంత్రాలయం - కర్నూలు మధ్య కొత్త లైను నిర్మించాలనే ప్రతిపాదన 52 ఏళ్ల నుంచి ఉంది. మూడు సార్లు సర్వే చేసి నిధులు వృథా చేశారు. 110 కిలో మీటర్ల పొడవైన ఈ మార్గం ఏర్పాటు చేస్తే కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది. కర్నూలు శివారులో రైల్వే మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాపు 2013 బడ్జెట్‌లో మంజూరు చేశారు. 100 ఎకరాల్లో స్థల సేకరణ చేసి పనులు చేపట్టారు. నిధుల కొరత కారణంగా పదేళ్లుగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.180 కోట్లు అవసరం కాగా గత బడ్జెట్‌లో రూ.58 కోట్లు కేటాయించారు కానీ పూర్తి స్థాయిలో మంజూరు చేయలేదు. కోట్ల హాల్ట్ స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్‌కు వచ్చే వారికి అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. స్టేషన్ అభివృద్ధికి రూ.2 కోట్లు అవసరం. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు 2013లో ట్రైన్ మెయింటెన్స్ షెడ్ మంజూరు చేసినా నామరూపాలు లేకుండా పోయింది. దూపాడు వద్ద దీనిని ఏర్పాటు చేస్తామని గతంలో రైల్వే సహాయ మాజీ మంత్రి కోట్ల హామీ ఇచ్చారు. రూ.200 కోట్లతో నిర్మిస్తే 5 వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలొస్తాయి. ప్రస్తుత రాజధాని విజయవాడకు కర్నూలు నుంచి నేరుగా రోజువారి రైళ్లు లేవు. ప్రత్యేక చార్జీలతో వారంలో మూడుసార్లు నడుస్తున్న మచిలీపట్నం స్పెషల్ రైలుతోనే సర్దుకోవాల్సి వస్తోంది. రోజువారిగా ఒక ఎక్స్‌ప్రెస్ ఇంటర్ సిటీ, మరో రెండు ప్యాసింజర్ రైళ్లను నడపాల్సిన అవసరం ఉంది. కొత్త జిల్లా నంద్యాలకు నేరుగా లైను లేని కారణంగా డోన్, బేతంచెర్ల మీదుగా రైళ్లు వెళ్తున్నాయి. 70 కిలో మీటర్లున్న నంద్యాలకు రైలులో వెళ్తే నాలుగున్నర గంటల సమయం పడుతోంది. కర్నూలు - నంద్యాల మధ్య కొత్త లైను ఏర్పాటు చేస్తే రెండు జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. డోన్- కర్నూలు మధ్య రైల్వే విద్యుద్దీకరణ పనులు పూర్తి కాగా కర్నూలు- మహబూబ్ నగర్ మధ్య పెండింగ్‌లో ఉంది. దీనికి నిధులు కావాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ **Open Plot for Sale at Kurnool,** Ganesh Nagar, 4th Class Employees Colony. East Face, Clear Title (Plot No.:654 A), 3Cents (22x60) Cent (15 Lakhs) 89192 53919 [L-793040]

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30x40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్ష మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 96118 10669 [L-793179]

■ పందిపాడు రోడ్డులో, సర్వే నెం.60/బి, వేణుగోపాల్ నగర్‌లో తూర్పు, ఉత్తరం, పడమర ఫేస్ గల కార్నర్ ప్లాట్లు స్కూల్, హాస్పిటల్, ఆఫీసులకు అనుకూలంగా ఉండు ప్లాట్లు అమ్మబడును. కొనాలన్న వారు మాత్రమే సంప్ర : 63093 48760 [L-793030]

■ భాష్యం న్యూ HMDA వెంచర్ @ కొత్తూరు, బెంగుళూరు హైవే 1KM అన్ని డె॥ క్లబ్ హౌస్, స్విమింగ్ పూల్ 50% బ్యాంక్ లోన్‌తో ప్లాట్స్ కలవు. ఫోన్ : 9951329192. [HA-720

SERVICES

BUSINESS

■ **Dehy Drated Curry Leaves powder, coriander leaves powder, tomato powder, onion powder, cash on delivery 200gm - 300 rs WhatsApp number 8143339050 order now** [DA-51129]

HEALTH CARE

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-932]

WANTED

■ ప్రముఖ హాస్పిటల్స్, వివిధ సంస్థలలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్స్, పార్కింగ్ బాయ్స్, హౌస్‌కీపింగ్ బాయ్స్ మరియు గర్ల్స్, ఆయాలు, వార్డు బాయ్స్, నర్సులు (GNM,ANM,BSC), పర్సనల్ అసిస్టెంట్ (F), రిసెప్షనిస్టు (F), టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్‌గా యువతి యువకులు కావలెను. సంప్ర : Enovizen Pvt. Ltd. **Cell : 96668 48880, 80088 69176** [L-482]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190562]

■ స్టార్ హోంకేర్ Hyd. లో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు, టెలికాలర్స్ కావలెను. జీతం : 16,000/- to 25,000/-. రూం + భో. ఫ్రీ. ఫోన్ : 86391 32775, 86398 28228 [V-775091]

■ G.B. Fruits & Vegetable Exporting: నందు పనిచేయుటకు మేనేజర్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ వర్కర్స్ - Boys & Gilrs కావలెను. జాబ్ లొకేషన్స్ : యాడికి, గార్లదిన్నె, డోన్, నంద్యాల, కోవెలకుంట్ల, నార్పల. Q: 10th, Inter, Degree. Salary: 10K, 15K, 20K. Interview : 01-02-2023, Venue: 3/A4-150, HP గ్యాస్ ఆఫీస్ మేడపైన, కడప రోడ్డు, తాడిపత్రి, అనంతపురం జిల్లా. Cont : Satheesh - 8184985774, Chinna - 9182034487. [A-325]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 16K ఎజెంట్ కమీషన్ 3K. ఫోన్: 7569955551, 9848571888. [H-786829]

■ ఈవెంట్ మెనేజ్‌మెంట్ లో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ. 25K to 39K ఇంట్రెస్టేడ్ ఉన్నవారు రెస్యూమ్ పంపండి వాట్సాప్ 6281159171. [HA-28601]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ, చేతి వ్రాత ద్వారా ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ రాయుటకు స్త్రీ / పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 72074 45296 [V- 6052]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779875]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

